నాటు సారా స్థావరాలపై దాడులు

విశాలాంధ్ర - కల్లూరు : జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు ఉలిందకొండ పోలీస్ స్టేషన్ ఇన్చార్జి ఎస్హెచ్ఓ విధులు నిర్వహిస్తున్న ట్రైనింగ్ డిఎస్పి పి. భావన కర్నూలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఉలిందకొండ ఎస్సై, సి.నల్ల ప్ప, ఓర్వకల్ ఎస్సై రాజా రెడ్డి సిబ్బంది తోకలిసి ఆదివారం కర్నూలు జిల్లా కల్లూరు మండలం ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మజరా గ్రామం కొల్లంపల్లి తండా చుట్టుపక్కల ప్రాంతాలలో తాండ ప్రజలు కొంత మంది అక్రమంగా నాటు సారా తయారు చేయడానికి ఏర్పాటు చేసుకున్న సారాబట్టీలపై దాడులు నిర్వహించి సుమారుగా 1800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడం, 60 లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకోటం జరిగింది. 2024 సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా కొల్లంపల్లి తండా గ్రామ ప్రజలకు తెలియజేయడం ఏమనగా అక్రమంగా నాటుసారా తయారుచేసి చుట్టుపక్కల గ్రామాలలో విక్రయిస్తున్న సందర్భంగా నాటు సారాను సేవించి కొంతమంది గొడవలకు కారణం అవుతు, కొన్ని సందర్భంగా గ్రామాలలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం వుంటుంది.కొల్లంపల్లి తండా గ్రామ ప్రజలు ఇప్పటినుంచి నాటు సారా తయారు చేయడం, విక్రయించడం మానుకోవాలని కోరడమైనది.సారా తయారీ మానని పక్షంలో చట్టపరంగా గట్టి చర్యలు తీసుకుంటామని, బాధ్యులపై పీడియట్టుకూడా నమోదు చేస్తామని నాటు సారా తయారీ దారులను హెచ్చరించడం జరుగుచున్నది.

అధికారం కోసం కోడి కత్తి డ్రామ

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : తెలుగు దేశం పార్టీ ఆఫీస్ నందు ఉమ్మడి జిల్లాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, షేక్ ముంతాజ్ విలేకరుల సమావేశం నిర్వహిం చడం జరిగింది దళితుడి జీవితాన్ని పణంగా పెట్టి జగన్ రెడ్డి తన రాజకీయ ప్రయోజనం నెరవేర్చుకున్నాడు కోడి కత్తి దాడి కేసులో కోర్టుకు హాజరవకుండా జగన్ రెడ్డి దళిత బిడ్డ శ్రీను జీవితాన్ని నాశనం చేస్తున్నాడు. విశాఖ విమానాశ్ర యంలో కోడి కత్తితో శ్రీనివాస్ చిన్న గాటు పెడితే ఏకంగా హత్యాయత్నం చేశారు చంద్రబాబు చేయించాడు అంటూ నానా యాగీ చేశారు. విమానాశ్రయం ఆసుపత్రి వైద్యులు పరిశీలించగా చిన్న గాయం మాత్రమే అయిందని ఎలాంటి విష ప్రయోగం లేదు అసలు ప్రమాదమే లేదని వైద్యులు తేల్చి చెప్పారు. అయినా హైదరాబాద్ వెళ్లి సిటీ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పేరుతో నానా హడావుడి చేశారు. సెంటీమీటర్ కూడా లేని గాయానికి 9 కుట్లు వేసుకొని ప్రకటనలు గుప్పించారు. ఘటనపై ఫిర్యాదు చేసిన సమయంలో తాను ఒక్కడినే ఉండగా ఒక యువకుడు వచ్చి కత్తితో దాడి చేశాడు. అని చెప్పారు అదే సమయంలో సెక్యూరిటీ రాకపోతే చనిపోయే వాడినని పేర్కొన్నారు. ఏపీ పోలీసులపై తనకు నమ్మకం లేదని అందుకే హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.అదే సమయంలో కేసు విచారణను ఎన్ ఐ ఏ కు బదిలీ చేయాలని కోరారు. అధికారం కోసం కోడి కత్తి దాడిని వాడుకుని జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోలేదు పైగా దళిత బిడ్డ శ్రీనుకు బెయిల్ కూడా రాకుండా కుట్రలు చేస్తున్నాడు బాధితుడిగా ఉన్న జగన్ రెడ్డి డిక్లరేషన్ ఇస్తే శ్రీనుకు బెయిల్ వస్తుందని కోర్టు చెప్పిన నిందితుడి కుటుంబ సభ్యులు వేడుకున్న జగన్ రెడ్డి ఇంతవరకు పట్టించుకోలేదు వాడుకొని వదిలేయడంలో సిద్ధహస్తుడైన జగన్ రెడ్డి కోడి కత్తి కేసులో కూడా అమాయకుడైన శ్రీను నీ వాడుకుని వదిలేశారు కోడి కత్తి కేసులో శ్రీను బెయిల్ పై కూడా బయటకు రాకుండా చేస్తూ తల్లిదండ్రులకు కుమారుడిని దూరం చేసి వారి కుటుంబాన్ని క్షోభ పెడుతున్నారు తల్లి సావిత్రమ్మ సోదరుడు సుబ్బరాజు న్యాయం కోసం శ్రీను బెయిల్ కోసం నిరాహార దీక్ష చేస్తున్న పట్టించుకోలేదు పేదరికం వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు కన్నీటి ఘోష మిగిల్చారు ఒక దళితుడి జీవితాన్ని తన స్వార్ధ రాజకీయ ప్రయోజనం కోసం వాడుకొని ఇప్పుడు కోర్టుకు హాజరు అవ్వకుండా శ్రీనును శాశ్వతంగా జైల్లోనే ఉంచే కుట్ర చేస్తున్నాడు.

అభివృద్ధి చేసే నాయకుడిని గెలిపించండి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : కర్నూలును అభివృద్ధి చేసే నాయకుడిని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మౌర్య ఇన్‌లో 6వ వార్డుకు చెందిన యువకుడు షాకీర్ బృందం.. ఫైరోజ్, రజాక్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. టి.జి భరత్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టి.జి భరత్ మాట్లాడుతూ అభివృద్ధి కావాలంటే తనను గెలిపించాలని కోరారు. స్వార్థపు ఆలోచనలతో తాము రాజకీయాల్లో ఉండటం లేదన్నారు. తన తండ్రి లాగే ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఇతర పార్టీల నాయకులు ఐదేళ్లలో ఎంత సంపాదించాలనుకుంటే..తాను మాత్రం ఎంత అభివృద్ధి చేయాలని ఆలోచిస్తానని భరత్ తెలిపారు.మంచి చేసేది ఎవరన్నది నాయకులు, ప్రజలు గుర్తించాలన్నారు. ఇక పార్టీలో చేరుతున్న వారు ఒక లీడర్ దగ్గరే ఉండాలన్నారు. పార్టీలు మారే నాయకులకు విలువ,గుర్తింపు ఉండదని ఆయన సూచించారు. తనను నమ్మి పార్టీలో చేరిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.తనను గెలిపిస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తప్పకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు జహంగీర్ బాషా, ఇబ్రహీం, మెహబూబ్, గౌస్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర కర్నూల్ లీగల్ : పాణ్యం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లోని దాదాపు 8 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వచ్చిన రూ 19,20,000/- ల చెక్కులను సంబంధిత అర్హులకు అందజేసిన,పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అన్నారు. నాలుగు మండలాలకు సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ ను చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఇలాంటివి ఇంకా ఎన్నో ప్రవేశ పెట్టి ముందుకు వెళ్తారు అన్నారు. రాష్ట్రంలో మరొకసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు షాపూరి వీరయ్య, రాష్ట్ర యువజన నాయకుడు అక్కి హనుమంత్ రెడ్డి, కొంగనపాడు సర్పంచ్ కేశవరెడ్డి, పెద్దటేకూరు ఎంపీటీసీ మునుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

41వ రోజు అంగన్వాడీల దీక్ష

విశాలాంధ్ర - వెల్దుర్తి : ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాదయాత్ర చేస్తున్నప్పుడు అంగన్వాడీలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను జగన్మోహన్రెడ్డికి విన్నవించారు. అధికారం లోకి వస్తే పక్కరాష్ట్రమైన తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు వేతనం ఇస్తానని హామిచ్చి నేడు అధికార సమయం పూర్తి కావస్తున్నా ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా, సిఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ దాదాపు 41 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న అంగన్వాడీలపై కనికరం లేకుండా, వారి డిమాండ్లను నిర్లక్ష్యం చేయడం దారుణమని ఏపి అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ అన్నారు.ఆదివారం అంగన్వాడీలు చేస్తున్న దీక్ష 41వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఒత్తిడి వలస వారి కిందిస్థాయి ఉద్యోగులు అంగన్వాడి వర్కర్ను నిరసన బంద్ చేసి, ఉద్యోగాలకు చేరాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కావున ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేని పక్షంలో దీక్షలను మరింత ఉధృతం చేస్తామన్నారు.అంగన్వాడి వర్కర్స్ అదిలక్ష్మి, శాంతకుమారి,రత్నకుమారి,జోష్నా,మహేశ్వరి,షబానాలు పాల్గొన్నారు.

అంగన్వాడీల అక్రమ అరెస్టు తగదు

విశాలాంధ్ర - ఆస్పరి : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని తక్షణమే అంగన్వాడిల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు 41వ రోజు అంగన్వాడీల సమ్మె కొనసాగించారు.నిరసన దీక్షలో ఉన్న అంగన్వాడీలను పోలీసుల అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఏఐటియుసి సిఐటియు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, సిఐటియుసి నాయకులు అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ

విశాలాంధ్ర - గోనెగండ్ల : బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ అందులో భాగంగానే మండల కేంద్రమైన గోనెగండ్ల లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం గోనెగండ్లలో 3రోజులు జరుగుతుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ గోనెగండ్ల కు త్రాగు-సాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే త్రాగు - సాగు నీరు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు.సూపర్ సిక్స్ ఆరు గ్యారంటీ పథకాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, తిరుపతయ్య, బేతాళ బడేసా, ఎన్ వి రామాంజనేయులు, రంగస్వామి నాయుడు, మదీనా, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్,నూర్ అహ్మద్,కోటేకల్ రఫీక్, భారతం రహమాన్ తుల్లా,ఊట్ల రంగస్వామి, డీలర్ పక్రుర్ ద్దీన్, మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రయాణికుడు జేబులో పది వేలు చోరీ

విశాలాంధ్ర - కర్నూల్ క్రైమ్ : కర్నూల్ నగరంలో పది వేల నగదు చోరి చేసిన ఆటో డ్రైవర్ను అరెస్టు చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కర్నూల్ టూ టౌన్ పట్టణ సీఐ ఇంతియాజ్ వివరాల ప్రకారం నగరంలోని అబ్బాస్ నగర్ కు చెందిన వెంకట శేషారెడ్డి అనే వ్యక్తి వెంకటరమణ కాలనీలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి వస్తు తిరిగి ఆటోలో వస్తుండగా బుధవార్ పేట కు చెందిన డేవిడ్ అనే ఆటో డ్రైవర్ అతని జేబులో నీ పదివేలను ఆటో డ్రైవర్ దొంగలించి మార్గమధ్యలో వదిలి వెళ్లాడు. నిందితున్ని గుర్తించి అదుపులోకి తీసుకొని నగదును రికవరీ చేసినట్లు కర్నూల్ పట్టణ టు టౌన్ పట్టణ సీఐ ఇంతియాజ్ తెలిపారు.

ఉద్యమ విప్లవ వీరుడు వి.ఐ.లెనిన్ శతవర్ధంతి

వి.ఐ.లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో ఘన నివాళులు

కర్నూలు లో

ఎమ్మిగనూరు లో

కోడుమూర్ లో

వెల్దుర్తి లో

దేవనకొండ లో

ఆదోని టౌన్ లో

విశాలాంధ్ర - కర్నూలు : ప్రపంచ వ్యాప్తంగా అసమానతలు లేని రాజ్య స్థాపనకై జరిగే పోరాటాలకు స్ఫూర్తి కామ్రేడ్.వి.ఐ. లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు.ఆదివారం నగరంలోని రాజ్ విహార్ కూడలి నందు సీపీఐ ఆధ్వర్యంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య,సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం లు మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ ను దునుమాడి ప్రపంచంలో మొట్టమొదటి సారి రష్యా లో సోషలిస్టు విప్లవాన్ని సాధింపచేసిన చిరస్మరణీయుడు లెనిన్ అని అన్నారు. ఆయన అస్తమించి నేటికి 100 ఏళ్ళు పూర్తి అవుతున్నప్పటికీ కూడా అనేక పోరాటాలకు స్ఫూర్తి గా నిలుస్తున్నారు. మార్క్స్ ఎంగిల్స్ రచనలను అధ్యయనం చేసి రష్యా దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వహించి,జార్ చక్రవర్తి నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం నాయకత్వం కింద పోరాడారని అన్నారు. మార్క్సిజం విప్లవ భావాలను ప్రచారం చేస్తున్నాడని 1895 సంవత్సరంలో 15 నెలల పాటు జైలు జీవితాన్ని గడిపి, మూడు సంవత్సరాల పాటు సైబీరియా దేశానికి ప్రవాసానికి ఆనాటి ప్రభుత్వం పంపించిందని అన్నారు. కామ్రేడ్ లేని ప్రవాసంలోనే ఉంటూనే ఇస్రాక (నిప్పురవ్వ) పత్రికను స్థాపించి, పార్టీ నిర్మాణానికి ఉపయోగించారని అన్నారు. 1914 సంవత్సరంలో మొదటి ప్రపంచ యుద్ధం నుంచి 1917 సం. అక్టోబర్ వరకు అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి, విప్లవాన్ని విజయవంతం చేసిన గొప్ప పోరాట యోధుడు కామ్రేడ్ లెనిన్ అని అన్నారు. తర్వాత కామ్రేడ్ లెనిన్ 1924 జనవరి 21వ తేదీన అస్తమించడం జరిగిందని అన్నారు. నేడు దేశంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూస్వామ్య, పెట్టుబడిదారి, సామ్రాజ్య వాద అనుకూల విధానాలతో కార్మిక, రైతుల మీద ఉక్కు పాదాన్ని మోపి పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. మనువాద హిందూ మతోన్మాదంతో మతాలు కులాల మధ్య విభజన చేస్తూ, మత కలహాలు, ఘర్షణలను సృష్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బూర్జువా,బూటకపు, పెత్తందారీ పెట్టుబడిదారీ విధానాలను ఎదుర్కోవాలంటే మార్క్సిజం, లెనినిజం సిద్ధాంత ద్వారా ప్రజా ఉద్యమాల ద్వారానే ఈ మతోన్మాద శక్తులను ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కారల్ మార్క్స్,ఎంగిల్స్, లెనిన్ సిద్ధాంతాలను ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారానే కామ్రేడ్ లెనిన్కు నిజమైన నివాళులర్పించిన వారమవుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్,సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు బీసన్న, కుమార్,నాగరాజు, అన్వర్,నల్లన్న, గిడ్డమ్మ, ఈశ్వర్,సోమన్న, మహిళా నాయకురాళ్లు అమీనాభి, సులోచనమ్మ, శైలజ, సీపీఐ నాయకులు కుమార్,రామచంద్ర మహబూబ్, కృష్ణ, బాబయ్య,సురేంద్ర, వీరయ్య,ఏఐఎస్ఎఫ్ నాయకులు మునిస్వామి, ఏఐటీయూసీ నాయకులు రాము, జయరాముడు, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : ప్రపంచంలోనే మొట్టమొదటి సోషలిస్టు రాజ్య నిర్మాత వి ఐ లెనిన్ మహాసేయుడి 100వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆదివారం సోమప్ప సర్కిల్లో లెనిన్ మహాసేడి ఫ్లెక్సీ ఏర్పాటు చేసి సిపిఐ సీనియర్ నాయకులు పంపన్న గౌడ్,దాదావ పూలమాలతో ఘనంగా నివాళులర్పించడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీయుల్లా నాయకులు మల్లికార్జున గౌడ్,కాజా,వీరేష్, విజయేంద్ర,శాంతప్ప, మద్దిలేటి,కృష్ణ,సాయి, నరసింహులు,ఎల్లప్ప, వీరేష్,కన్నా,తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు : కార్మిక రాజ్య మహోపాధ్యాయుడు, అసమానతలు లేని రాజ్యాన్ని నిర్మించిన మహాశయుడు కామ్రేడ్ విఐ లెనిన్ శత వర్ధంతి పురస్కరించుకొని సీపీఐ, ఎఐయస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి బి.రాజు,ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీరాములు,ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామిలు విఐ లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ టౌన్ కార్యదర్శి మదు,నాగరాజు, రాము,అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి : రష్యాలో కమ్యూనిజం సోషలిస్ట్ వ్యవస్థ నిర్మాణం చేసి కార్మిక రాజ్యాన్ని కామ్రేడ్ విఐ లెనిన్ స్థాపించారని సిపిఐ మండల కార్యదర్శి టి.కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం విఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల అధ్యక్షుడు మాధవస్వామి, సిపిఐ మండల సహాయకార్యదర్శి డి.రాజు, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, చిన్న వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు అనీల్, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు వీరన్నలు పాల్గొన్నారు.

దేవనకొండ రూరల్ : సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో వి.ఐ.లెనిన్ గారి చిత్ర పటానికి సీపీఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు, సీనియర్ నాయకులు పి.ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం లెనిన్ శత జయంతి కార్యక్రమాన్ని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఎమ్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు రాజన్న, రామంజి, రంగన్న, రవి, కోదండ, రామాంజనేయులు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్ : తొలి సోషలిస్టు విప్లవాన్ని సాధించిన మహా విప్లవ నేత విఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్లో ఆదివారం సిపిఐ పార్టీ, ప్రజాసంఘాల సమక్షంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు పాల్గొని మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థను దునుమాడి ప్రపంచంలో మొట్టమొదటిసారి రష్యాలో సోషలిస్ట్ విప్లవాన్ని సాధింపజేసిన చిరస్మరణీయుడని లెనిన్ అని కొనియాడారు. లెనిన్ అస్తమించే 100 సంవత్సరాల కాలంలో సమాజం ఎంతగానో పురోగమించిందని చెప్పుకొచ్చారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉత్పత్తి విధానంలో అద్భుతమైన ఆవిష్కరణలు జరిగాయని గుర్తు చేశారు. దీని ఫలితంగానే సంపద పెద్ద ఎత్తున సృష్టించబడుతుందన్నారు. లెనిన్ సమాజానికి చేసిన సేవలను వివిధ రంగాలపై చేసిన పోరాటాన్ని గుర్తుచేస్తూ ఆయన జీవిత చరిత్రపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఓబి నాగరాజు, సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు, లక్ష్మీనారాయణ,కొత్తూరు హనుమంతు,నాగరాజు, కొత్తూరు గంగన్న,రంజిత్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి తింటూ అంగన్వాడీల వినూత్న నిరసన

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : అంగన్వాడీల సమ్మె రోజు రోజుకు ఉదృతం అవుతుంది. ఆదివారం గడ్డి తింటూ అంగన్వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్వాడీల సమ్మె 41వ రోజు చేరుకుంది. నగరంలోని ధర్నా చౌక్ దగ్గర జరిగిన సమ్మె శిబిరంలో ఓర్వకల్లు సెక్టార్ అంగన్వాడీలు పి.లక్ష్మీదేవి, బి. వరలక్ష్మి, డి.నాగలక్ష్మి, పి.భారతి, పి.హేమలత,ఎస్. మహబూబ్బి,పి. సుశీలమ్మ, కే.రాధమ్మ, కే.రాజ్యలక్ష్మి, కె.వెంకటేశర్మ,జి.శివకుమారి, అనురాధ, తులసమ్మ, బి. భారతి, ఎల్.లక్ష్మీదేవి, ఎం.చంద్రకళ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా (ఏఐటీయూసీ) అంగన్వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, సిఐటియు జిల్లా అంగన్వాడి యూనియన్ గౌరవాధ్యక్షులు పి.నిర్మల,ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం రమేష్ బాబు, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జె రఘుబాబు, ప్రజాశక్తి ఎడిషన్ ఇంచార్జ్ యం. చంద్రయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 41 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడి సమస్యలు ఏమాత్రం కూడా పట్టని ముఖ్యమంత్రి జగన్ ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి కావడం దురదృష్టమని చెప్పారు.గత నాలుగు సంవత్సరాల కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారని తెలిపారు. సమస్యల పరిష్కారం చేయకుండా జీతాలు పెంచకుండా ఎస్మా చట్టం తీసుకురావడం,తొలగిస్తామని నోటీసులు ఇస్తామని, సోమవారం లోపల మీరు డ్యూటీలకు హాజరుకావాలని సూపర్వైజర్లతో ఒత్తిడి తీసుకురావడం బెదిరించడం కొత్త వారిని నియమిస్తామని చెప్పడం పట్ల వారు తీవ్రంగా వ్యతిరేకించారు.ఒకపక్క న్యాయబద్ధంగా చట్టబద్ధంగా సమ్మె నోటీసులు ఇచ్చి సమ్మెలో పాల్గొంటున్న అంగన్వాడీలను ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదని వారు తెలిపారు. హైకోర్టులో పిటిషన్ వేసి వాదనలు కూడా జరుగుతున్నాయని, కోర్టులో ఉన్న కేసు పరిష్కారం కాకుండా అంగన్వాడీలను తీసివేస్తామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి కి వినపడడం లేదా కనపడడం లేదా అని వారు తెలిపారు.ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రాబోయే కాలంలో జగన్మోహన్ రెడ్డి ఇంటికి పోవలసి వస్తుందని వారు హెచ్చరించారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా మరింత మంది అంగన్వాడీల బలిదానాలు కాకముందే అంగన్వాడీల వేతనాలు పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి యస్. మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె సుధాకరప్ప, ఎస్.మహమ్మద్ రఫీ, అంగన్వాడీలు చౌడేశ్వరి, విజయ, రాధా, విజయమ్మ, భారతి, భాగ్యలక్ష్మి, రాధిక, మహేశ్వరి, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సమ్మె పై ఉక్కు పాదం

విశాలాంధ్ర - కర్నూలు : అంగన్వాడీల సమ్మె 41వ రోజు చేరుకున్నది. సోమవారం జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ ని ముందస్తు అరెస్టు చేసి త్రీ టౌన్ స్టేషన్ లో నిర్బంధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల అరెస్టులతో, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని,అక్రమ అరెస్టులు సమస్యకు పరిష్కారం కాదని అన్నారు.ఈ విధమైన చర్యలకు పాల్పడితే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అవుతుందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఇప్పటికైనా ప్రభుత్వం సాను కూలంగా స్పందించి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ హెచ్చరించారు.

లెనిన్ మార్గం అనుసరణీయం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచ వ్యవస్థ మార్పు మార్క్స్ సిద్ధాంతంతోనే సాధ్యమని, దాన్ని అమలు చేసి చూపిన లెనిన్ మార్గం అనుసరణీయమని వక్తలు అన్నారు. కారల్‌మార్క్స్-ఎంగెల్స్-లెనిన్ విగ్రహ కమిటీ అధ్వర్యంలో వీఐ లెనిన్ శత వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద ఆదివారం ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ 20వ శతాబ్దపు చరిత్ర గతిని మలుపుతిప్పిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. బోల్షివిక్ పార్టీ, సైనికుల కృషితో నూతన సమాజాన్ని నిర్మాణం చేశారని తెలిపారు. అదే స్ఫూర్తిని, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు కృషి చేస్తున్నారని చెప్పారు. భారతదేశంలో రైతాంగాన్ని, కార్మిక వర్గాన్ని కలుపుకుని అభ్యుదయ సమాజాన్ని నిర్మించాలని లెనిన్ సూచించారని అన్నారు. నాటి మినిట్స్ విజయ్ ప్రసాద్ రచించిన పుస్తకం ద్వారా ఇప్పుడు బయటకు వస్తున్నాయన్నారు. కమ్యూనిస్టులు లేకుండా సమాజ మార్పు సాధ్యం కాదని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కష్టజీవుల కోసం లెనిన్ పని చేయటం వల్లనే ఆయన చనిపోయి వందేళ్లు అయినా గుర్తు పెట్టుకున్నారని, నేడు భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా లెనిన్ శత వర్ధంతిని ఘనంగా జరుపుకుంటున్నారని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమిలేక మతం చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. రామ మందిరం నిర్మాణం కోసం ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ ప్రచారం చేసుకుంటే పర్వాలేదని భారత ప్రభుత్వం, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మత ప్రచారం చేయటం సరికాదన్నారు. సాధువులు, సన్యాసులు చేయాల్సిన పనిని ప్రధాన మంత్రి చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు సృష్టించిన సంపదను అదాని, అంబానికి మోదీ దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. శ్రమజీవులు ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని, కష్ట జీవుల గుండెల్లో లెనిన్ కనిపిస్తారని తెలిపారు. రాబోయే రోజుల్లో లెనిన్ సెంటర్ స్ఫూర్తి కేంద్రంగా కొనసాగాలని సూచించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో సోషలిజం ఎలా ఉంటుందో చూపించిన మహానేత లెనిన్ అని అన్నారు. ఆయన స్ఫూర్తితో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మంది ప్రభావితం అయ్యారని చెప్పారు. నేడు పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉందన్నారు. పాలకులు దానధర్మాలు చేస్తారు తప్ప వేతనాలు పెంచటానికి ఇష్టపడరని ఆనాడు లెనిన్ చెప్పిన మాట నేటి పాలకుల ద్వారా కనబడుతోందన్నారు. చైనా అభివృద్ధి చెంది... పెట్టుబడిదారీ విధానానికి సవాల్ విసురుతోందన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం మత స్వేచ్ఛను నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కారల్‌మార్క్స్ చెప్పిన సమాజ మార్పును చేసి చూపిన గొప్ప నాయకుడు లెనిన్ అన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు డి.రమాదేవి మాట్లాడుతూ మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన మొదటి సోషలిస్టు నాయకుడు లెనిన్ అన్నారు. జనసాహితి సంపాదకులు దివికుమార్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో కేజీ గ్యాస్ నిక్షేపాలను దోచుకోవటానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. కమ్యూనిస్టు నాయకులు భార్గవశ్రీ మాట్లాడుతూ నేటి సమాజానికి లెనిన్ సిద్ధాంతాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు బుడ్డిగ జమిందార్, ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, ప్రజాసాహితి సంస్థలు ప్రచురించిన ప్రత్యేక సంచికలు, క్యాలెండర్‌ను కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ముందుగా ప్రముఖ కళాపోషకులు గోళ్ల నారాయణరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన క్రేన్ సాయంతో లెనిన్ విగ్రహానికి కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు పూలమాల వేశారు. ఈడ్పుగంటి నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ప్రజానాట్య మండలి కార్యదర్శి అనిల్ తదితరులు అభ్యుదయ గీతాలు ఆలపించి ఉత్తేజితులను చేశారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు. వామపక్ష ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను అనేక మంది సందర్శించారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్య నారాయణ మూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నాయకులు సీహెచ్.బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, సీపీఐ ఎంఎల్ నాయకులు పి.ప్రసాద్, కె.పొలారితో పాటు వామపక్ష పార్టీల నేతలు, మేధావులు, లెనిన్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు లెనిన్ విగ్రహం వద్ద అభివృద్ధి చేశారు.

యువతకు ఆదర్శం లెనిన్ పోరాట పటిమ

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు: ప్రపథమ సోషలిస్టు రాజ్య స్థాపకులు వీఐ లెనిన్ పోరాటపటిమ నేటి యువతకు ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం గుంటూరు జిల్లా వ్యాప్తంగా జయప్రదంగా నిర్వహించారు. గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని పట్టణాలు, నియోజకవర్గాలు, మండలాలలో లెనిన్ విగ్రహాలకు, చిత్రపటాలకు సీపీఐ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో శత వర్ధంతి సభలు నిర్వహించారు. గుంటూరు నగరంలో జరిగిన వర్ధంతి సభలో ముప్పాళ్ల నాగేశ్వరరావుతో పాటు కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచాన్ని శాసిస్తున్న సామ్రాజ్యవాదంపై తిరగబడి ప్రత్యామ్నాయ వ్యవస్థను తీసుకురావడంతో పాటు దానిని ఆచరణలో చూపిన గొప్పనేత కామ్రేడ్ వీఐ లెనిన్ అని కొనియాడారు. దోపిడికి, బానిసత్వానికి వ్యతిరేకంగా ఆనాడు ఆయన పోరాడిన తీరు నేటి యువతకు స్ఫూర్తిదాయమన్నారు. కమ్యూనిస్టుగా ఉండటము, బతకడం కాదని, కమ్యూనిస్టు విలువలు, ఆశయాలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసుకోవడమే శత వర్ధంతి సందర్భంగా లెనిన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. మంగళగిరిలో జరిగిన సభలో చేతివృత్తిదారులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాలలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శులతో పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని లెనిన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలలో వక్తలు ప్రసంగిస్తూ సోషలిస్టు రాజ్య ప్రాముఖ్యతను తెలిపారు. సోషలిస్టు రాజ్య స్థాపనకు లెనిన్ చేసిన కృషిని వివరించారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలను గద్దెదించేందుకు లెనిన్ చూపిన బాటలో నడవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

భవిష్యత్ తరాలకు దిక్సూచి లెనిన్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): భవిష్యత్ తరాలకు దిక్సూచిలా వీఐ లెనిన్ ఉన్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా మార్క్స్-ఎంగెల్స్- లెనిన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు కొనసాగే ' మాట-పాట' సాంస్కృతిక కళా ఉత్సవాల్లో మొదటి రోజు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షులు పి.చంద్రనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ లెనిన్ చిన్నతనం నుంచే శ్రమ దోపిడీ నివారించటానికి కృషి చేశారన్నారు. స్వీయ కుటుంబ అనుభవంతో అధ్యయనం చేసి జార్ చక్రవర్తి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. మార్క్స్ సిద్ధాంతాన్ని ఔపోసన పట్టిన లెనిన్ కొంత కాలం అజ్ఞాతంలో ఉండి రష్యా, యూరప్ స్థితిగతులు అధ్యయనం చేశారన్నారు. గ్రామీణ పేదలందరిని విద్యావంతులను చేసి, దోపిడీ నుంచి విముక్తి చేసి మానవ సమాజాన్ని ప్రభావితం చేశారని కొనియాడారు. ఆధునిక కార్మిక వర్గమే విప్లవానికి చోదక శక్తి అని నిరూపించటం ద్వారా హోచిమిన్ ఇతర సోషలిస్టు నాయకులకు ఆదర్శంగా నిలిచారన్నారు. సామాన్య ప్రజల ఈతి బాధల పట్ల సున్నిత పద్ధతులలో విప్లవ ఉద్యమాన్ని ఆచరణ సాధ్యం చేసిన మహనీయుడు లెనిన్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు సాంస్కృతిక కళల ద్వారా ప్రజా చైతన్యానికి నిరంతర కృషి సాగించాలని జేవీ సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. లెనిన్ విగ్రహ సెంటర్‌కు పూర్వ వైభవాన్ని తెచ్చిన నిర్వాహక కమిటీ సభ్యులందరికీ ప్రత్యేకించి గోళ్ళ నారాయణరావు, మనోహర్ నాయుడుకు, సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సాంస్కృతిక ఉత్సవాలను కళా పోషకులు గోళ్ల నారాయణరావు ప్రారంభించారు.

స్ఫూర్తిదాయకంగా మాట-పాట: లెనిన్ శత వర్ధంతిని పుస్కరించుకుని నిర్వహించిన 'మాట-పాట' సాంస్కృతిక కార్యక్రమంలో ఆద్యంతం స్ఫూర్తివంతంగా సాగింది. మార్క్స్ సిద్ధాంతం, లెనిన్ ఉద్యమ కార్యాచరణ, హోచిమిన్, లక్సంబర్గ్, ఫీడెల్ క్యాస్ట్రో పోరాటలను స్మరిస్తూ నేతల ప్రసంగాలు స్ఫూర్తినిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి అధ్యక్షులు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, విజయవాడ నగర నాయకులు లంక దుర్గారావు, ఎస్‌కే.నజీర్, శర్మ, బాషా, ప్రజానాట్య మండలి కార్యదర్శి ఎస్.అనిల్, అప్పన్న తదితరులు విప్లవ గీతాలు ఆలపించారు. అజేయమైనది కమ్యూనిజం. అజరామర మైనది సోషలిజం...,ఎర్రబాట..ఇది ఎర్రపాట.., రెపరెపలాడే ఎర్రని జెండా..ఎదిరించే పోరాడే జెండా...., ఓ..అరుణ పతాకామా.. చే గోనుమా రెడ్ సెల్యూట్... కమ్యూనిజం పిలుస్తోంది....కదులు సోదరా..వంటి గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి మనోహర్ నాయుడు, ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ కే లక్ష్మయ్య, సాహితీవేత్తలు గుమ్మా సాంబశివరావు, వెన్న వల్లభరావు, ప్రోగ్రసీవ్ ఫోరం నాయకులు బుడ్డిగ జమిందార్, సాహితీ ప్రియులు కళాభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విప్లవ రథసారథి విఐ లెనిన్

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: కమ్యూనిజమే ఆయుధంగా రష్యా విప్లవానికి సారథ్యం వహించి విజయపథంలో నడిపించి ప్రపంచంలో సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించిన విప్లవ రథసారథి విఐ లెనిన్ మహనీయుడని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ కోటేశ్వరరావు శ్లాఘించారు. విఐ లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో వివిధ కేంద్రాలలో జరిగిన కార్యక్రమాల్లో కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెనిన్ నాయకత్వంలో సాగిన అక్టోబర్ మహావిప్లవ పోరాట చరిత్రను, ఆనాటి ప్రజల త్యాగాలను వివరించారు. మార్క్సిజాన్ని అధ్యయనం చేసి ఆచరణ సాధ్యమయ్యే విధంగా మెరుగులు దిద్ది, మరింత పదును పెట్టారని తెలిపారు. దోపిడీ పాలకులైన జార్ చక్రవర్తులను గద్దె దించి, వర్గ, దోపిడీ రహిత వ్యవస్థ సోషలిస్టు రాజ్య స్థాపనకు వీరోచితమైన నాయకత్వ పాత్రను పోషించారని వివరించారు. ప్రపంచంలో అనేక దేశాలు ఈ స్ఫూర్తితో సోషలిస్టు రాజ్యాలుగా వడివడిగా విప్లవ పోరాటాల ద్వారా రూపాంతరం చెందాయన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం విజయవంతం కావడంలో లెనిన్ చూపిన మార్గదర్శకాలు ముఖ్య పాత్ర వహించాయని చరిత్రలోని అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయని తెలిపారు. లెనిన్ మహాసేన పోరాట బాటలో మన దేశంలో కూడా సమసమాజ స్థాపనకు సన్నద్ధం కావాలన్నారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గా కోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. ఇబ్రహీంపట్నంలో సీపీఐ మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు టి.నర్సింహారావు, జి.మధుసూదన్ రావు, రాంబాబు, జమలయ్య, ఎస్.వి.కృష్ణ తదితరులు నాయకత్వం వహించారు. రంగాపురంలో పోతురాజు సాంబయ్య, ఏసు, చల్లదాసు, పి.గణపతి వీరాస్వామి తదితరులు, పార్టీ మండల కార్యదర్శి అడపా సుబ్బారావు, రాఘవులు, తిరుపతిరావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు.

కాంగ్రెస్ యాత్రలో చేరవద్దని బెదిరింపులు

బిస్వనాథ్ చారియాలి (అసోం): అసోంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం భారత్ జోడో న్యాయ యాత్రలో చేరకుండా ప్రజలను బెదిరిస్తోందని, ఆ మార్గంలోని కార్యక్రమాలకు అనుమతులను నిరాకరిస్తున్నదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం ఆరోపించారు. కానీ ప్రజలు బీజేపీకి భయపడరని స్పష్టం చేశారు. బిస్వనాథ్ జిల్లా ప్రధాన కార్యాలయం బిస్వనాథ్ చారియాలీలో జరిగిన బహిరంగ సభలో గాంధీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీపై కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'యాత్రలో భాగంగా మేం సుదీర్ఘ ప్రసంగాలు చేయం. పతిరోజూ 7 నుంచి 8 గంటల పాటు ప్రయాణిస్తూ మీ సమస్యలను వింటూ ఈ సమస్యలను లేవనెత్తడమే మా లక్ష్యం' అని అనన్నారు. యాత్రలో పాల్గొనకుండా ప్రజలను బెదిరిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ జెండాలు, బ్యానర్లను ధ్వంసం చేస్తున్నారని, ఆ మార్గంలో కార్యక్రమాలకు అనుమతులు నిరాకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'ప్రజలను అణచివేయగలమని వారు (ప్రభుత్వం) భావిస్తారు. కానీ ఇది రాహుల్ గాంధీ యాత్ర కాదని వారు గుర్తించడం లేదు. ఇది ప్రజల గొంతు కోసం చేస్తున్న యాత్ర' అని తెలిపారు. ఆదివారం ఉదయం అరుణాచల్ ప్రదేశ్ నుంచి బిస్వనాథ్ ద్వారా యాత్ర తిరిగి అసోంలోకి ప్రవేశించింది. 'రాహుల్ గాంధీ గానీ, అసోం ప్రజలు గానీ మిమ్మల్ని చూసి భయపడరని, మీరు ఏది కావాలంటే అది చేయగలరు. ఎన్నికలు వచ్చినప్పుడు కాంగ్రెస్ భారీ మెజార్టీతో బీజేపీని ఓడిస్తుంది' అని తెలిపారు. రాహుల్ గాంధీ కూడా ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మను లక్ష్యంగా చేసుకుని విమర్శలు కురిపించారు.

లెనిన్ పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కులు సాధిద్దాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు

విశాలాంధ్ర-కడప రూరల్: వెయ్యేళ్లు అయినా మరిచిపోని విప్లవకారుడు, కార్మిక రాజ్య స్థాపకుడు లెనిన్ అని, లెనిన్ పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని సీపీఐ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ హాల్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసే నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిని మరో మనిషి దోపిడీ చేయడం, ఒక వర్గం మరో వర్గాన్ని దోపిడీ చేయడం, ఒక రాజ్యాన్ని మరో రాజ్యం ఆక్రమించడం వంటి భూస్వామ్య రాచరిక వ్యవస్థను కూలదోసి కార్మిక వర్గ రాజ్య స్థాపనకు విశేషమైన కృషిచేసిన విప్లవ యోధులు లెనిన్ అని కొనియాడారు. జార్ చక్రవర్తి నిరంకుశత్వాన్ని రాచరిక వ్యవస్థను బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించారన్నారు. నేడు దేశంలో అధికారం చెలాయిస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామిక హక్కులు, కార్మిక హక్కులు కాలరాస్తూ రామ రాజ్యం అంటూ రాచరిక వ్యవస్థను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు పరిశ్రమలు ఆస్తులు అన్ని ప్రైవేటుపరం చేస్తోందని దీంతో కార్మిక హక్కులు 8 గంటల పని విధానం లేకుండా చేసి బానిస వ్యవస్థ తయారు అవుతోందన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, కార్యవర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, బషీరున్నిషా, విజయలక్ష్మి, సుబ్రమణ్యం, వెంకటశివ, కేసి.బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు సావంత్ సుధాకర్, మద్దిలేటి, వెంకట్రామ్, మునయ్య, నాగేశ్వరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐటీయూసీ నాయకులు శివయ్య, మల్లికార్జున్‌రెడ్డి, రామలింగారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయం లెనిన్ జీవితం: రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ : ఆదర్శనీయం లెనిన్ జీవితం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం కర్నూలు జిల్లా పత్తికొండలో నిర్వహించారు. లెనిన్ చిత్రపటంతో స్థానిక చదువుల రామయ్య భవనం నుంచి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టి నాలుగు స్తంభాల మండపం దగ్గర లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెనిన్ నాయకత్వంలో రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం స్ఫూర్తిదాయకమన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్, గురుదాస్, కృష్ణయ్య, తిమ్మయ్య, ప్రజాసంఘాల నాయకులు ఉమాపతి, నెట్టికంటయ్య, గిడ్డయ్య గౌడ్, ఎం. కె.సుంకన్న, హనుమేష్, పెద్దయ్య, నజీర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. కార్మిక రాజ్యస్థాపకుడు, అసమానతలు లేని రాజ్యాన్ని నిర్మించిన మహాశయుడు వీఐ లెనిన్ అని సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి వద్ద సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన లెనిన్ చిత్ర పటానికి గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.జగన్నాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమములో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, డోన్, నంద్యాల, నందికొట్కూరు, బనగానపల్లె లలో లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మార్క్సిజమే దిక్సూచి: డి.పాపారావు

విశాలాంధ్ర-ఒంగోలు: మార్క్సిజమే సకల మానవాళికి దిక్సూచి అని ప్రముఖ సామాజిక, అర్థశాస్త్ర, సైద్ధాంతిక విశ్లేషకులు డి.పాపారావు అన్నారు. విఐ లెనిన్ శత వర్ధంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఒంగోలుతో పాటు కనిగిరి, మార్కాపురం, ఎర్రగొండపాలెంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ అధ్వర్యంలో మార్క్సిజం సకల మానవాళికి దిక్సూచి కాబోతుందా అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కమ్యూనిజం పత్రిక ఎడిటర్ ఎంసీ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. వక్తగా హాజరయిన డి.పాపారావు మాట్లాడుతూ 107 సంవత్సరాల క్రితం మానవ సమాజాన్ని పట్టిపీడిస్తున్న రాచరికం, వెట్టి చాకిరి, వలస పాలన విధానం, అవిద్య, అంతులేని దోపిడీ, దురాక్రమణ వంటి ఆటవిక పాలనా విధానాన్ని అంతం చేయడానికి మార్క్సిజం అనే సిద్ధాంత వెలుగులో విఐ లెనిన్ సారథ్యంలో రష్యాలో మొట్టమొదటి సోషలిస్టు విప్లవ రాజ్యం ఏర్పడిందన్నారు. పెట్టుబడిదారీ సమాజంలో ప్రజల, కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతూనే ఉంటుందన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లోనే కుప్పలుగా చేరుతుందన్నారు. ప్రజలు నిత్యం ఉపాధి కోసం, తిండి, కూడు, గుడ్డ కోసం అల్లాడుతూనే ఉంటారని తెలిపారు. ప్రభుత్వాలు కూడా పెట్టుబడిదారుల పక్షాన నిలిచి వారికి ఊడిగం చేస్తూనే ఉంటాయన్నారు. పెట్టుబడిదారీ సమాజం ఉన్నంతకాలం నిరుద్యోగం రాజ్యమేలుతూనే ఉంటుందన్నారు. యాంత్రీకరణ పేరుతో కార్మికుల సంఖ్య పరిశ్రమలలో గణనీయంగా తగ్గిస్తూనే ఉంటారన్నారు. కార్మికులు మరింత బానిసలుగా మారతారన్నారు. కార్మిక హక్కులు హరించి వేస్తారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్మిక, శ్రామిక వర్గానికి, ప్రజలకు మార్క్సిజం దిక్సూచిగా నిలుస్తుందన్నారు. తొలుత లెనిన్ శత వర్ధంతిని నిర్వహించారు. అనేక మంది లెనిన్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, ఒంగోలు నగర కార్యదర్శి పి.వి.ఆర్.చౌదరి, సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎం.వెంకయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.డి.సర్దార్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, సీపీఐ కొండేపి మండల కార్యదర్శి లక్ష్మి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎం.విజయ, పీడీపీఎఫ్ బ్యాంక్ చైర్మన్, న్యాయవాది పోతినేని వెంకటేశ్వర్లు తదితరులు లెనిన్‌కు నివాళులర్పించారు.

అఖిలభారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్‌ని లక్నో ఆసుపత్రిలో కలసి అరోగ్య విషయాలను తెలుసుకుంటున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య తదితరులు.

PRINTED & PUBLISHED BY EDUPUGANTI NAGESHWARA RAO, On Behalf of VISALAANDHRA VIGNANA SAMITI, PRINTED AT AMODA PUBLICATIONS PVT. LTD, AMODA PRESS, Andhra Jyothi Buildings, S.No: 1/1 & 1/2, Near Indus High School,Gooty Road, Pandipadu Grama Panchayati, KURNOOL, ANDHRA PRADESH, PUBLISHED AT VISALAANDHRA VIGNANA SAMITI, C.R.BHAVAN, SAPTAGIRINAGAR, KURNOOL, ANDHRA PRADESH. EDITOR : R.V. RAMARAO. RNI NO:APTEL/2013/54446. Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : 08518-255522,255555, Fax No. 277721, E-Mail : visknl@ yahoo.com

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 22, జనవరి 2024

దూదేకుల నూర్‌భాషా సంఘం ఏర్పాటు

విశాలాంధ్ర-చాగలమర్రి : చాగలమరి మండలం దూదేకుల నూర్ భాషా సంక్షేమ సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం మండలఅధ్యక్షుడు ఆర్ మహబూబ్ బాషా మాట్లాడుతూ మండలస్థాయి నూర్ భాషా సోదరులతో కమిటీ ఏర్పాటు చేసామన్నారు. కమిటీలో గౌరవ అధ్యక్షులుగా పీరయ్య, ఎన్ బాబయ్య, మండల అధ్యక్షులు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులు పెద్దదస్తగిరి, పెద్ద భాష, జిలాన్ భాష, దస్తగిరి, కోశాధికారి డివి లాల్ బాషా, దస్తగిరి, ప్రధానకార్యదర్శి మస్తాన్, దస్తగిరి, యూత్ అధ్యక్షులు ఇమాం భాషా, ప్రచార కార్యదర్శి ఫక్రుద్దీన్, బాబు, కమిటీ ఇంచార్జ్ లాల్‌బాషా, కన్వీనర్ సుబ్బరాయుడులను ఎంపిక చేశారు. అలాగే ఈసీ సభ్యులుగా లాల్ మొయిద్దీన్, కాసిం, దండయ్య,మాబు షరీఫ్, చిన్న పీరయ్య, పూల ఫక్రుద్దీన్, చిన్న మస్తాన్, ఓబులేసు, సుబ్బ దస్తగిరి, పెద్ద పీరయ్య, మస్తాన్, బుజ్జిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కొత్తగా ఎంపికైన సభ్యులను కమిటీ పెద్దలు ఘనంగా సన్మానించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం- మాజీ ఎమ్మెల్యే బీసీ



విశాలాంధ్ర -కొలిమిగుండ్ల : వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, పరిపాలనను గాలికి వదిలేసారని బనగానపల్లి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని కనకాద్రి పల్లి, రాఘవ రాజు పల్లి గ్రామాలలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు ఆయనకు కనకాద్రి పల్లి గ్రామ ప్రజలు టిడిపి నాయకులు అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు టిడిపి అధికారం లోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారెంటి పథకాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ ఆయా మతాల వారి పండుగలకు కానుకలు ఇవ్వకుండా పేద ప్రజల సంతోషాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దూరం చేశారన్నారు. సంపూర్ణ మద్యపానం నిషేధం అమలు చేశాకే 2024న ఓటు అడుగుతానని అని చెప్పిన జగన్ నేడు ఏ మొహం పెట్టుకొని ఓటు అడుగుతారన్నారు. కరెంట్, బస్సు చార్జీలతో పాటు నిత్యవసర వస్తువుల ధరలను పెంచి వైసిపి ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందన్నారు. గత టిడిపి ప్రభుత్వ హాయంలో పై రెండు గ్రామాలలో 2.64కోట్లతో అభివృద్ధి చేశామని, అభివృద్ధికి మారుపేరు టిడిపి అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత కింద సంవత్సరానికి 20వేల రూపాయలు, చదువుకునే ప్రతి బిడ్డకు 15వేల రూపాయలు, ఆడబిడ్డ నిధి కింద సంవత్సరానికి 18 వేల రూపాయలు అందిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వీఆర్ లక్ష్మీరెడ్డి, ఐ వి పకీర రెడ్డి, మండల కన్వీనర్ మూలె రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఉపసర్పంచ్ రామలక్ష్మణ్, ఓబులేసు, కోటపాడు శివరామిరెడ్డి, ఎంపీటీసీ పెద్దన్న, పెద్దిరెడ్డి, వెంకట మల్లారెడ్డి, రాఘవ రాజు పల్లి నాయకులు సాయి రెడ్డి,రామకృష్ణారెడ్డి సర్వేశ్ రెడ్డి, శేఖర్, రామ లింగం,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలక పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్సీ ఇషాక్‌బాష, కమిషనర్ రవిచంద్రారెడ్డి

విశాలాంధ్ర - నంద్యాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రా రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత భారత్ సంకల్ప యాత్ర ఆత్మకూరు బస్టాండు సమీపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమపథకాల గురించి ప్రజలలో అవగాహన కల్పించడానికి, అర్హులై ఉండి సంక్షేమ పథకాల్లో లబ్ది పొందని వారు ఉంటే వారిని నమోదు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంవికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని 2023 నవంబర్ 25న ప్రవేశ పెట్టడం జరిగిందని, ఇందులో భాగంగా పట్టణంలో 2 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గిరిజన సమాజాలకు గౌరవం, హక్కులు అవకాశాలు, సాధికారతపై మహిళలకు భరోసా, అయుస్మాన్ భారత్, పిఎం జనారోగ్య యోజన, అణగారిన వర్గాలకు సామాజిక భద్రత, పిఎం జన్-ధన్ యోజన, పిఎం సురక్ష యెజన, రైతు సంక్షేమానికి భరోసా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పురందర్, మెప్మా పీడీ భాస్కర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి, శానిటేషన్ సూపరైజర్ శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభిరుచి మధు ఆధ్వర్యంలో నంద్యాలలో బిజెపి భారీర్యాలీ

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాలలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరికి నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. బీజేపీ శ్రేణుల కోలాహలం పండుగ వాతావరణం తలపించింది. నంద్యాలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా భారీగా తరలి రావడంతో బిజేపి ర్యాలీ విజయవంతమయింది. రాష్ట్రంలో బిజెపి పథకాలు ప్రజల్లోకి తీసుకొని వెళ్లేందుకు బిజెపి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆంధ్రప్రదేశ్లో బిజెపి పాగా వేయడానికి పావులు కదుపుతోంది.ఈనేపథ్యంలోనే నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్‌గా అభిరుచి మధుకు అవకాశం దక్కడంతో బిజెపి పార్టీని బలోపేతం చేయడానికి సిద్ధమయ్యారు. నంద్యాల నియోజకవర్గంలో బిజెపి కార్యకర్త లను ఏకం చేయడంలో విజయం సాధించారు. ఈ నేపథ్యంలోనే బిజెపి బూత్ కమిటీలు, నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా బిజేపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరికి ఘనస్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. దగ్గుబాటి పురంధేశ్వరి నంద్యాలకు చేరుకోవడంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. బిజెపి కార్యాలయంలో నేతలకు పూల మాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఆమె వెంట నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, బిజేపి జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి, డా. ఇంటి ఆదినారాయణ, మాజీ కౌన్సిలర్ మేడా మురళీధర్, కసెట్టి కృష్ణమూర్తి, కశెట్టి చంద్రశేఖర్, శిల్పా శివజ్యోతిరెడ్డి, స్వాతి, శ్రీలక్ష్మి, బిజేపి నాయకులు కార్యకర్తల మధ్య బిజెపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం వాల్ సిగ్నేచర్ చేసి సమీప దుకాణాలు, ఇళ్లకు వెళ్లి బీజేపీ కరపత్రాలు అందించి బీజేపీ చేసిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ భారీ జనసందోహం మధ్య ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రభుత్వ ఆస్పత్రి, సాయిబాబా నగర్, ఫైర్ స్టేషన్, టెక్కె, పద్మావతినగర్, మున్సిపల్ కార్యాలయం మీదుగా సౌజన్య ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ జరిగింది.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర- ఆదోని : ఈ నెల 28, 29వ తేదిలలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జీ జయమనోజ్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మనోజ్‌రెడ్డి, విమల రిజెన్సీ సీఈఓ పవన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చొరవ చూపి ఆదోనిలో విమల రిజెన్సీ సీఈఓ రూ.100 కోట్లతో ఫైవ్ స్టార్ హోటల్‌తో పాటు కన్వెక్షన్ సెంటర్, బ్యూటీషియన్, న్యూట్రిషియన్, సూపర్‌మార్కెట్, ప్లేజోన్, ఫుడ్‌కోర్టు, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు దశల వారిగా ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 28, 29వ తేదిలలో జరిగే జాబ్ మేళాలో 10వ తరగతి ఉతీర్ణత పొందిన యువతీ, యువకులు, నిరుద్యోగులు వయోపరిమితి లేకుండ దరఖాస్తు చేసుకొవచ్చని, దాదాపు 250 మందికి మొదటి విడతలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని అన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్, బ్యూటిషీయన్ లాంటి కోర్సుల కోసం యువతీ, యువకులు హైదరాబాద్, బెంగుళూరు లాంటి పట్టణాలకు వెళుతున్నారని, అలాంటి వారి కోసం దాదాపు 100 మంది నిరుద్యోగులకు వారి అర్హత, ఆసక్తిని బట్టి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో పాటు తదితర కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి నెలకు రూ.5 నుండి 8వేల వరకు స్టైఫండ్ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదిన విమల రీజెన్సీ ప్రారంభం అవుతోందని, దశల వారిగా ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 700 మంది దాకా ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.ఆదోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని, కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ అశోక్, వైకాపా నాయకులు సన్ని, వినోద్‌రెడ్డి, దేవా, పెద్దిరెడ్డిశ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దినదినాభివృద్ధి చెందుతున్న దేవరగట్టు

విశాలాంధ్ర-హొలగుంద : మండలంలోని నేరనీకి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి దినాదినాభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన బన్నీ ఉత్సవం దేవరగట్టులో జరుగుతుంది దేవరగట్టు ఆలయానికి అలాంటి మాతా మాన్యాలు లేకపోయినప్పటికి ప్రజలు భక్తులు అధికారులు రాజకీయ నాయకులు చెల్లించిన విరాళం నగదు బహుమతులతో పాటు వస్తురూపమైన ఇచ్చిన కానుకలతో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైకాపా నాయకులు వీర నాగప్ప ఆదివారం తెలిపారు. విద్యుత్ శాఖలో చిరు ఉద్యోగిగా పనిచేస్తున్న నేరనికి తండాకు చెందిన జయరాం నాయక్ తన సొంత ఖర్చులతో పాటు భక్తులు ప్రజలు చెల్లించిన లక్ష రూపాయల విరాళంతో రెండు మంచినీటి ట్యాంకులను నిర్మించారు. అలాగే ఆలయాల్లో నాపరాళ్ళ బండలను అమర్చారు కొత్త మంచినీటి ట్యాంకులను వైకాపా నాయకులు వీరనాగప్ప, సోమప్ప, రాము నాయక్, మంజు నాయక్, సాధన్న, అర్చక పురోహితులు గిరి మల్లయ్య స్వామి, జయ మల్లప్ప స్వామి, రవి శాస్త్రిలు, భక్తుడు జయరాం నాయక్ ప్రారంభించారు ప్రజలు భక్తులు మంచినీటి ట్యాంకును సద్వినియోగం చేసుకోవాలని నీటి వృధాను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు నీటి ట్యాంక్ నిర్మించిన భక్తుడు జయరాం నాయకులు దేవరగట్టు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

వైయస్ షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ బలపడుతుంది

విశాలాంధ్ర - హొలగుంద : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డిఎస్ భాష పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల కు పార్టీ కండువా వేసి ఘనంగా సన్మానించారు. ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భాష మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా పిసిసి అధ్యక్ష పదవి చేపట్టిన వైఎస్ షర్మిల వల్ల కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని అన్నారు. అధికార పార్టీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా వ్యతిరేక పాలన వల్ల ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని చేయడానికి కిందిస్థాయి నుండి పీసీసీ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అనుబంధాలు నాయకులు వచ్చే ఎన్నికల్లో సైనికులవలె పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రధాని మన్మోహన్ సింగ్ హాయంలో దేశంలోని ప్రజలందరికీ సంక్షేమ పథకాలు రైతులకు మహిళలకు ఎంతో చేయూతనిచ్చారని కొనియాడారు. ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు .పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు డి ఎస్ నూర్, ఇబదుల్ల, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయల ఆత్మగౌరవ రిలే నిరాహార దీక్ష కొనసాగింపు

విశాలాంధ్ర -హొలగుంద : ఆలూరులో 4వ రోజు చేరుకున్న వాల్మీకుల ఎస్టి సాధన కోసం ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంగం కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆదివారం హొళగుంద మండల వాల్మీకి బోయ యువ నాయకులు సంఘీభావం తెలిపారు . దీక్షకు మద్దతు తెలుపుతూ వాల్మీకి యువ నాయకులు పెద్దహ్యాట పి.శ్రీరంగ ,దిడ్డి తిక్కస్వామి మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్రం వచ్చిన కూడా బోయ వాల్మీకులకు మాత్రం స్వాతంత్రం రాలేదు ఎందుకంటే ఎటువంటి కులావృత్తి లేని బోయ వాల్మీకులుగా ఈ దేశంలో జీవనం కొనసాగిస్తున్నారు. విద్య ఉపాధికి నోచుకోరి బోయ వాల్మీకులు ఉన్నంత విద్య చదవాలన్న ఉన్నత స్థాయికి జీవన ఉపాధి కోసం ఎదగాలన్న ఎస్టీ సాధన ఏకైక మార్గం కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో కలిపిస్తామంటూ వైఎస్‌ఆర్పిపి అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చి మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొట్ట మొదటి అసెంబ్లీలోని బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తా మని హామీ ఇచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ తీర్మానం జరగలేదనీ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కూడా గతంలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తామంటూ సాక్షాత్తు నరేంద్ర మోడీ పిఎం హామీ ఇచ్చిన కానీ ఇచ్చిన మాట హామీలకే పరిమితం అవుతుందనీ వాపోయారు. కానీ బోయ వాల్మీకులను గుర్తించి ఎస్టి రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయి. కాబట్టి రాబోయే ఎన్నికల్లో ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బోయ వాల్మీకులు అందరూ ఏకతాటిగా వచ్చి ఈ ప్రభుత్వాలకు పాడె కడతామని ఈ సభాముఖంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి యువ నాయకులు పెద్దహ్యాట వీరేష్, రారాయి సిద్దు ,హైకల్ మల్లికార్జున, పులి మల్లయ్య, శ్రీను ,వెంకటేష్, మల్లి ,మహేశ్ ,బోయ వాల్మీకి కుల యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీరువోలులో చీరలు గాజులు పంపిణీ

విశాలాంధ్ర-బనగానపల్లె: అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని బీరవోలులో కుకుట్ల రామలక్ష్మమ్మ, కుకుట్ల గురప్ప, చాకలి కోమలి, చాకలి శివ ప్రసాద్ తమ సొంత ఖర్చు లక్ష రూపాయలు వెచ్చించి 526 చీరలు, 130 డజన్ల గాజులతో పాటు పసుపు,కుంకుమ కొనుగోలు చేసి గ్రామంలోని ప్రతి మహిళకు చీర, గాజులతో పాటు పసుపు, కుంకుమ పంపిణీ చేయడం జరిగింది. దాతలు మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవం శ్రీరామచంద్రుడు విగ్రహం అయోధ్యలో నెలకొల్పడుతున్న శుభ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు.

రాష్ట్రంలో కాపుల సత్తా చాటుదాం- మండ్లెం రామిరెడ్డి

విశాలాంధ్ర - మిడుతూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాపులు అంతా ఒకే తాటిపై నిలబడి తమ సత్తా చాటే ఎందుకు సమయం ఆసన్నమైందని కాపు సంక్షేమ సంఘం నాయకులు శ్రీరామ , శ్రీ కృష్ణ థియేటర్ల యజమాని మండ్లెం రామిరెడ్డి, నవనంది పాఠశాల డైరెక్టర్ బత్తుల శ్రీధర్ , జనసేన నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షులు పూజల రాంభూపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీ నవనంది పాఠశాల ఆవరణంలో బలిజ ,తెలగా, ఒంటరి కులస్తుల కాపు సంక్షేమ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోదరులు విడుదల చేశారు. అనంతరం పట్టణ సీఐ ప్రకాష్ కుమార్ తో కలసి కాపు సంక్షేమ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశతో ఉన్న వాడికి కాదు ఆశయంతో వచ్చిన వాడిన అండగా నిలబడదామని కాపులకు పిలుపునిచ్చారు. అంతేకాక కె ఎస్ ఎస్ వ్యవస్థాపకులు మాజీ హోంశాఖ మంత్రి చేగొండి హరి రామ జోగయ్య ఆశయ సాధనకు బలిజ కులస్తులు అందరూ ఏకతాటిపై నడవాలి అన్నారు. బలిజలు రాష్ట్ర జనాభాలో 22 శాతం ఉన్నప్పటికీ ఏ రాజకీయ పార్టీ కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మెల్యే ,ఎంపీ టికెట్ గాని ఇవ్వలేదన్నారు. ఇరు రాజకీయ పార్టీలో తమ పదవులను చేపట్టేందుకు బలిజలను కేవలం సేవకులను గానే వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బలిజలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోతున్నారన్నారు. ఇప్పటికైనా బలిజ సోదరులందరూ ఏకతాటిపై నిలబడి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు కమతం మహేశ్వర్ రెడ్డి, సుబ్బారెడ్డి, నందవరం చంద్రశేఖర్ , గాజా మల్లికార్జున ,రాము, గుర్రాల వేణుగోపాల్ రెడ్డి ,శంకరయ్య ,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో ఏపీలో బలమైన శక్తిగా బీజేపీయే

విశాలాంధ్ర - నంద్యాల : రాబోయే ఎన్నికల్లో బిజెపి ఏపీలో బలమైన శక్తిగా ఎదుగుతుందని ఏపీబిజెపి అధ్యక్షురాలు పురంధరేశ్వరి అన్నారు. నంద్యాలలోని సౌజన్య ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన శక్తి కేంద్ర ప్రముఖులు, బూతు అధ్యక్షుల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వికసిత్ భారత్ పేరుతో బిజెపి ప్రజల్లోకి వెళుతుందని, నరేంద్ర మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు.ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట బ్రహ్మాండంగా జరుగుతుందని, అందుకు సంబంధించి ఏపీలో ప్రభుత్వం సెలవు ప్రకటించలేదని, తక్షణమే సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దొంగ ఓట్లకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ కు రాష్ట్ర ఎంపీలతో కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అలాగే గత ఉప ఎన్నికల్లో తిరుపతిలో 36వేల దొంగ ఓట్ల ఏపీ కార్లను డౌన్లోడ్ చేసుకొని ఓటు వేసుకుందని, అందుకు సంబంధించి సీఈసీకి ఫిర్యాదు చేయగా ఒక అధికారిపై సస్పెండ్ చేసిందని గుర్తు చేశారు. దొంగ ఓట్ల విషయంలో భారతీయ జనతా పార్టీ మొదలుపెట్టదని ఆమె తెలిపారు.

జనసేన మా మిత్రపక్షమే

బిజెపి, జనసేన ఎక్కడ విడిపోయినట్లు పవన్ కళ్యాణ్ చెప్పలేదు. పొత్తుల విషయం మా అధిష్టానం చూసుకుంటుందని, రాష్ట్రంలో బిజెపి అభివృద్ధి కోసం కార్యకర్తలు ఉత్సాహంతో పని చేస్తున్నారని, బిజెపిని సంస్థాగతంగా అభివృద్ధి చేసుకొని రాబోయే ఎన్నికల్లో బిజెపి బలియమైన శక్తిగా ఎదగడానికి కృషి చేస్తామన్నారు.

ప్రతి ఇంటి కి జైశ్రీరామ్ నినాదంతో రామనామ స్మరణ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్ల లో 22వ తేదీ సోమవారం నాడు అయోధ్య శ్రీరామచంద్రుని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవస్థానం గాంధీ నగర్ లో.ఏర్పాటు చేస్తున్న వేదిక. ప్రతి రామభక్తుడు ఏకతా రథయాత్రలో పాల్గొనని, శ్రీరామ జ్యోతి రథయాత్రలో పాల్గొనని, శ్రీరామశిల రథయాత్రలో పాల్గొనని, శ్రీరామ గుడి నిధి ఏర్పాటు కార్యక్రమాల్లో పాల్గొనని శ్రీరామ భక్తులు చివరి కార్యక్రమమైన" శ్రీ అయోధ్య రామచంద్ర ప్రభు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం వీక్షించడానికి మీ యొక్క కార్యక్రమములను ముగించుకుని 22వ తారీఖున గాంధీ నగర్ లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన శ్రీరామచంద్రుని కళ్యాణ వేడుకలు తిలకించాలని, అయోధ్య లో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రతిష్ట ప్రత్యక్ష కార్యక్రమాన్ని పెద్ద తెరపై వీక్షించడానికి ఏర్పాటు చేయడం జరిగింది, అలాగే అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అదే రోజు సాయంకాలం శ్రీ రామ జయ రామ విజయ మహా మంత్రాన్ని నామస్మరణ చేస్తూ కోయిలకుంట్ల గ్రామంలో గ్రామోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ప్రతి రామభక్తుడు పాల్గొని ఆ అయోధ్య శ్రీ రాముడి ఆశీస్సులను ప్రతి శ్రీ రామభక్తుడు పొందాలని, శ్రీరామ కార్యాన్ని ప్రజలందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

విశాలాంధ్ర -చాగలమర్రి : మండలంలోని పెద్దవంగలిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారుల సమక్షంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు కేంద్ర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా, సుకన్య సమృద్ధి, బాలికల బంగారు భవితవ్యం గురించి వివరించారు. 26వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో సంకల్ప యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు బంగారు షరీఫ్, ఎంపిహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెంకటేశ్వర్లు,వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.